## క్లుప్తంగా

### ఎమ్మెల్సీకి రాఖీ కట్టిన మంత్రి సీతక్క



విఠల్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

**బెజ్జూర్:** తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌కు గురువారం రాఖీ కట్టారు. ఈ సందర్భంగా రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేసిన సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర భావం, సోదరీమణుల అంతర్గత సందేశాన్ని తెలియజేస్తుందని అన్నారు.

### పాఠశాలల్లో వైద్యశిబిరం



విద్యార్థులకు రక్తపరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

**లింగాపూర్:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచందర్, సూపర్‌వైజర్ దత్తారాం, ఎంపీవో రజనీకాంత్ అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీ, ఎంపీపీఎస్ పాఠశాలలు, అంబేద్కర్ కాలనీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులకు వైద్యసిబ్బంది పరీక్షించారు. జలుబు, దగ్గు, డెంగీ, మలేరియాతోపాటు తదితర లక్షణాలు ఉన్న వారిని గుర్తించారు. విద్యార్థులకు ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ కుమార్ రక్తనమూనాలు సేకరించారు. అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. ఏఎస్‌వో ప్రసన్నభారతి, ఏఎన్ఎంలు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో రామచందర్

**లింగాపూర్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని ఎంపీడీవో రామచందర్ అన్నారు. మండలంలోని జాముల్‌ధర గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను గురువారం పరిశీలించారు. ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. ఎంపీవో రజనీకాంత్ లబ్ధిదారులు ఉన్నారు.

### సదాశివ మాస్టార్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న పద్మశాలిలు

**కాగజ్‌నగర్ టౌన్:** తెలంగాణ సిద్ధాంత కర్త, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత డాక్టర్ సామల సదాశివ వర్ధంతిని పట్టణ పద్మశాలి భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సామల సదాశివ మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సామల సదాశివ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిందం చంద్రయ్య, రాపెల్లి సదానందం, గుల్లపల్లి నాగేశ్వర్‌రావు, గడ దాసు మల్లయ్య, వడ్నాల వెంకన్న, నూతి సుదర్శన్, సామల రాజన్న, కటుకం మదూకర్, ప్రభాకర్, మామిడాల రామకృష్ణ పాల్గొన్నారు.

### నియామకం



సన్మానిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఆసిఫాబాద్ బజరంగ్‌దళ్ సురక్ష ప్రముఖ్‌గా శివ, సత్సంగ్ ప్రముఖ్‌గా బట్టుపల్లి రాములను ఏకగ్రీవంగా నియమించినట్లు వీహెచ్‌పీ కార్యదర్శి ఆకుల సంతోష్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు. నూతనంగా నియామకమైన ప్రతినిధులను సభ్యులు సన్మానించారు. మూడు రాష్ట్రాల క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యంజీ, మంచిర్యాల జిల్లా కార్యదర్శి వేముల రమేశ్, అధ్యక్షుడు రాజలింగు, ఉపాధ్యక్షుడు సంతోష్, సహాయ కార్యదర్శి రాజు, బజరంగ్‌దళ్ సయోజక్ శ్రావణ్, సహసంయోజక్ విపిన్‌లు పాల్గొన్నారు.



గోయగాం మొయిన్‌రోడ్డును కప్పేసిన చెట్లు

# హరితతోరణం

- రోడ్ల వెంట ఆహ్లాదకరం
- ఆరేళ్లలో నాటిన మొక్కలు 2.30 లక్షలు
- స్వచ్ఛమైన గాలితోపాటు నీడనిస్తున్న చెట్లు
- కొనసాగుతున్న వనమహోత్సవం

**కెరమెరి:** పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం హరితహారం, కాంగ్రెస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం నిర్వహిస్తోంది. ఈనెల ప్రారంభం నుంచి అధికారులు మండలవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో పొలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గట్లపై మొక్కలు నాటుతూ వస్తున్నప్పటికి ఆ తర్వాత ఎవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో ప్రస్తుతం ఎటు చూసిన రోడ్లకు ఇరువైపులా కూలీలు మొక్కలు నాటుతున్నారు. మండలంలోని 31 పంచాయతీల్లో గడిచిన ఆరేళ్లలో 2.30 లక్షల మొక్కలు నాటగా.. సుమారు 85 వేల మొక్కలు బతికి ఉన్నాయి. ఈ ఏడాది 57,755 మొక్కల టార్గెట్ ఇవ్వగా.. 49,600 వేల మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటుతున్నారు.

**రోడ్లకు పచ్చనిహారం..**

ఆరేళ్లలో ఐదేళ్లక్రితం నాటిన మొక్కలు నేడు చెట్లు అయి ప్రధాన రోడ్లకు పచ్చనిహారంలా మరుతున్నాయి. ఫలితంగా వచ్చేపోయే వాహనదారుల కనువిందు చేస్తున్నాయి. నాటిన మొక్కల్లో అడవి తంగేడు, మల్బరీ వేప, సీమచింత, వేప, అల్లనేరేడు, ఫెల్టోఫామ్, గుల్‌మోహర్‌తోపాటు వివిధ రకాల పూల చెట్లు నీడనిచ్చేవి ఉన్నాయి. స్వచ్ఛమైన గాలితోపాటు నీడనిస్తున్నాయి. వేసవికాలంలో ఈ చెట్లు ఎంతో హాయినిస్తున్నాయి. ఇప్పటికి పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీలు, ఆశ్రమోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విరివిగా స్థలం ఉన్నప్పటికి మొక్కలు నాటాడం లేదు. నాటిన పర్యవేక్షణ లేక అవి నిర్జీవమై పోతున్నాయి.

**పర్యావరణానికి ఆక్సిజన్..**

చెట్లు పర్యావరణానికి అనేక విధాలుగా సహకరిస్తున్నాయి. ఆక్సిజన్‌ను ఇస్తున్నాయి. నీటిని, నేలను సంరక్షించడంలో, వన్యప్రాణులను ఆదుకోవడంలో సహాయపడుతున్నాయి. చెట్లు గాలితోపాటు పండ్లు, కూరగాయలు, మొక్కల ఆధారిత ఆహార పదార్థాలను సైతం అందిస్తున్నాయి. మొక్కలు పుష్పాలను ఉత్పత్తి చేస్తాయి. మానవులు తమ పరమైన ఆచారాల కోసం వీటిని ఉపయోగిస్తున్నారు. కలప, సుగంధద్రవ్యాలను కూడా పొందవచ్చు.



ఆకట్టుకుంటున్న సావర్‌కెడా అంతర్గతరోడ్డు

### మిగిలిన చోట నాటుతాం



నాటిన మొక్కలు సంరక్షించడం అందరి బాధ్యత. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల్లో ఐదేళ్లలో 85 వేల వరకు బతికి ఉన్నాయి. ఈ ఏడాది మండలానికి 57 వేల మొక్కలు నాటాలని టార్గెట్ ఇవ్వగా, 49,600 వేల మొక్కలను ఎవెన్యూ ప్లాంటేషన్‌లో వినియోగించాం. మిగిలిన మొక్కలను చనిపోయిన చోట నాటుతాం.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

# పంటలకు అందని సాగునీరు..!



ఇప్ప చెరువు కట్ట

- ఇప్ప చెరువు కట్టకు కానరాని మరమ్మతులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

**బెజ్జూర్:** ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంటలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఇప్ప చెరువు నిర్మించింది. అప్పట్లో చెరువు ద్వారా పంటలకు సాగునీరు అందించారు. అయితే కొన్నేళ్లుగా చెరువు కట్ట తెగిపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నా చెరువులో చుక్క నీరు కూడా నిల్వ ఉండడం లేదు.

**ఏటా ఇవే తిప్పలు..**

ఇప్ప చెరువు కట్ట మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరువులో పుష్కలంగా నీరు ఉండాల్సి ఉన్నా పరిస్థితి భిన్నంగా ఉంది. చెరువు కట్ట తెగిపోయి ఏళ్లు గడుస్తున్నా.. మరమ్మతులు చేపట్టకపోవడంతో చుక్కనీరు నిల్వ ఉండడం లేదు. మండలంలోని బెజ్జూర్, ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్ ఆయకట్టు రైతులు పంటలను సాగునీరందక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

**విరాళాలు సేకరించి మరమ్మతులు..**

ఇప్ప చెరువుకు మరమ్మతులు చేపట్టి పంట సాగుకు నీరందించే విధంగా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండకపోవడంతో ఏడాది పాటు పంటకు నీరందించేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో రైతులందరూ కలిసి విరాళాలు సేకరించి ఆ డబ్బులతో ప్రతీ సంవత్సరం బస్తాల్లో మట్టి నింపి తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో బస్తాలు కొట్టుకుపోతుండడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువుకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

### సాగునీరు అందడం లేదు



మండల కేంద్రంలో ఇప్ప చెరువు ఉన్నప్పటికీ పంటలకు సాగు నీరు అందడం లేదు. భారీగా వర్షాలు కురుస్తున్నప్పటికీ కట్ట తెగి ఉండడంతో చెరువులో నీరు నిల్వ ఉండటం లేదు. ఏటా ఇవే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– చౌదరి శంకర్, రైతు

### మరమ్మతులు చేయాలి



ఏళ్లుగా చెరువు కట్ట మరమ్మతులకు నోచుకోవడం లేదు. పుష్కలంగా వర్షాలు పడుతున్నా నీరు చెరువులో నిలువడం లేదు. పంటలకు సాగు నీరు అందాల్సి ఉండగా, తమ కళ్లెదుటే వృథా అవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– కె.చంద్రయ్య, రైతు

## ఖర్జెల్లి గూడెం రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దోని శ్రీశైలం

**చింతలమానెపల్లి:** మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం రహదారి పనులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం గురువారం ప్రారంభించారు. కర్జెల్లి నుంచి గూడెం వరకు రహదారి అధ్వానంగా మారిందన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు డోకె రామన్న, పాల్వాయి సుధాకర్‌రావు, చౌదరి నానయ్య, డోకె మల్లేష్, అంకులు, భద్రేష్, జితేందర్, వెంకటి పాల్గొన్నారు.

## ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**కాగజ్‌నగర్ టౌన్:** దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన వశాక విఠల్ కుటుంబసభ్యులకు ఎల్‌వోసీని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం అందజేశారు. వశాక విఠల్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం రూ.1.50 లక్షల ఎల్‌వోసీ లేటర్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## స్పందించి రక్తదానం చేసి..



రక్తదానం చేస్తున్న అటవీ అధికారి

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న ఇద్దరు గర్భిణులకు అటవీ అధికారులు స్పందించి గురువారం రక్తదానం చేశారు. కాగజ్‌నగర్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణీ మడావి ఇస్రుబాయి (5గ్రాములు), ఇదే మండలం మాణిక్ కొఠారి గ్రామానికి చెందిన గీతుబాయి (6గ్రాములు) స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా వారికి ఉండాల్సిన దానికంటే తక్కువ రక్తం ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. వెంటనే రక్తాన్ని ఎక్కించాలని సూచించగా దాతల కోసం అటవీ బీట్ అధికారి మహేశ్‌ను సంప్రదించారు. వెంటనే సిబ్బందికి విషయాన్ని చేరవేయగా కనర్గాం సెక్షన్ అధికారి విజయ్. బీట్ అధికారి వెంకటేశ్ స్పందించి రక్తాన్ని అందించారు. కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞత

## విశ్రాంత ఉద్యోగికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

**రెబ్బెన:** సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగి మహ్మద్ రియాజొద్దీన్‌కు గురువారం ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి చెక్కును అందించారు. ఖైరిగూర ఓసీపీలో అసిస్టెంట్ చైన్‌మెన్‌గా పనిచేస్తూ రియాజొద్దీన్ కార్పొరేట్ మెడికల్‌బోర్డుకు దరఖాస్తు చేసుకున్నారు. అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ చేసింది. వారసులకు ఉద్యోగం కానీ, ఎంఎంస్ (నెలవారీ జీవన భృతి) కోసం దరఖాస్తు చేసుకోకుండా ఏక మొత్తం చెల్లింపు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాంతో ఆదాయపు పన్ను మినహాయింపు కాగా మంజూరైన రూ.21,56,800 చెక్కును జీఎం అయనకు అందజేశారు. ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, ఎస్వోటూ జీఎం రాజమల్లు, గోలేటి ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, డీవైపీఎం ఎస్వీ రాజేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసీనా

**ఆసిఫాబాద్:** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తల్లిపాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ కాలనీలో సూపర్‌వైజర్ పెంటుబాయి గురువారం తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, దీంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ వనిత, తల్లులు పాల్గొన్నారు.

**కెరమెరి:** కెస్లగూడ 1, 2, చింతకర్ర, బాబేఝరి కేంద్రాలను కలిపి కెస్లాగూడ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు.

**పెంచికల్‌పేట్:** మండలంలోని చేడ్వాయి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసీనా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకునే ఆహారంలో పోషకాహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు., అనుబంధ ఆహారం ప్రతి ఇంటికీ అందచేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అబ్దుల్ ఉన్నీసా బేగం, రాజేశ్వరి, కవిత, తిరుపతమ్మ, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

### విద్యార్థులు చదవాలి



విద్యార్థినితో చదివిస్తున్న ఎంఈవో ప్రకాశ్

**కెరమెరి:** విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని సుల్తాన్గూడ(ఉ/మీ) పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. ఉర్దూతోపాటు ఆంగ్లంలో ప్రావీణ్యం పొందాలన్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు రావాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతీరోజు రెండు సార్లు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరువేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**చింతలమానెపల్లి:** మండలంలోని రుద్రాపూర్ గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి లింగయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. బెజ్జూర్ మండలం సలుగుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య ద్విచక్ర వాహనంపై చింతలమానెపల్లి వైపు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చి, బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

### రేపు సామూహిక యజ్ఞోపవీతం

**కాగజ్‌నగర్ టౌన్:** పట్టణంలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో ఆగస్టు 9న రాఖీ పౌర్ణమిను పురస్కరించుకొని సామూహిక యజ్ఞోపవీతం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ పద్మశాలి సంఘం భవన నిర్వాహణ అధ్యక్షుడు సిందం చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలిలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### ఆదివాసీ దినోత్సవానికి తరలిరండి

**ఇంద్రవెల్లి:** గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ వ్యవస్థ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి అధిక సంఖ్యలో తరలిరావాలని రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు అన్నారు. గురువారం మండలంలోని గిన్నేర గ్రామంలో రాయిసెంటర్ సార్‌మేడి, గ్రామ పటేల్, గ్రామ పెద్దలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్, రాయిసెంటర్ జిల్లా సలహాదారుడు కుంర విఠల్‌రావ్ పాల్గొన్నారు.

### వాగు దాటి వైద్యం అందించి..



వాగుదాటి బారిక్‌రావుగూడకు వెళ్తున్న వైద్యసిబ్బంది

**నార్నూర్:** నార్నూర్ మండలంలోని మల్లెంగి పంచాయతీ పరిధి బారిక్ రావుగూడకు వెళ్లాలంటే వాగు దాటి వెళ్లాలి. గాదిగూడ మండలం ఝరి పీహెచ్‌సీ పరిధిలోని మలేపూర్ సబ్ సెంటర్ పరిధిలో బారిక్‌రావుగూడ ఉంది. గురువారం వైద్యసిబ్బంది గ్రామస్తుల సహకారంతో వాగుదాటి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అడే సంజీవ్, ఏఎన్ఎం చంద్రకళ, హెచ్ఏ వినోద్, ఆశ కార్యకర్త మోతుబాయి, లక్ష్మీబాయి తదితరులు ఉన్నారు.

## ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



బాలురలకు రాఖీలు కడుతున్న బాలికలు



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పెంచికల్‌పేట్:** మండలంలోని ఎంపీపీఎస్ సంజీవనగర్ పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి ఒకరికొరకు శుభాకాంక్షలు చెప్పకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ అన్నచెల్లెల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీక నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీచర్లు తిరుమల, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**రెబ్బెన:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

## షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించాలి



అజ్మీర శ్యాంనాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

**రెబ్బెన:** మండల కేంద్రంలో షాదీఖానా నిర్మాణం కోసం స్థలం కేటాయించేలా కృషి చేయాలని మసీద్ కమిటీ సభ్యులు కోరారు. మండల కేంద్రంలో వివిధ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మసీద్ కమిటీ సభ్యులు జహీర్‌బాబా, నాసిర్ ఉస్మానీ, జహురొద్దీన్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు రవినాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రవీందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**గెస్ట్‌హౌస్ పరిశీలన..**

ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఖాళీ స్థలంలో మార్కెట్ సముదాయం నిర్మించాలని చిరువ్యాపారులు గురువారం అజ్మీర శ్యాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఆయన పర్యటనలో భాగంగా ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు.

**ఆటో యూనియన్ నాయకులకు సన్మానం**

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న ఆటో యూనియన్ నాయకులను గురువారం కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జీ అజ్మీర శ్యాంనాయక్ సన్మానించారు. వారి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ నాయకులు నర్సింగరావు, వెంకటేశ్వర్‌గౌడ్, ఉమేష్‌గౌడ్, విజయ్, సతీశ్, బాబా పాల్గొన్నారు.